క్లుప్తంగా

అమ్మవారికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

పాఠశాలల పరిశీలన


పురిటిపెంట న్యూకాలనీ పాఠశాలలో రాగి జావను పరిశీలిస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట న్యూకాలనీ, ఎం.వెంకటాపురం ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈఓ విమలమ్మ, ఎంఈఓ-2 సాయిచక్రధర్ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. (తుఫాన్ నేపథ్యంలో ఇటీవల పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో ఆదివారం పాఠశాలలు తెరిచారు). విద్యార్థులకు అందించిన రాగి జావతో పాటు మధ్యాహ్న భోజన వంటకాలను, రికార్డులను ఎంఈఓలు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. వారి వెంట సీఆర్పీ రెడ్డి ఉన్నారు.

మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న సన్యాసినాయుడు


గుర్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసి నాయుడు అన్నారు. మండలంలోని పున్నపురెడ్డిపేటలో మండల పరిషత్ నిధులు రూ.2లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. స్థానిక నాయకులు పున్నపురెడ్డి రామకృష్ణ, అప్పలనాయుడు, రాము, రామారావు పాల్గొన్నారు.

రూ. 50వేల ఆర్థిక సహాయం


లక్ష్మణరావు కుటుంబానికి సాయం అందజేస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థిసేన అధ్యక్షుడు రమణ, తదితరులు

చీపురుపల్లిరూరల్: మండలంలోని పోతాయవలస గ్రామానికి చెందిన చివుకు లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో ఏడాదిగా మంచానికే పరిమితమయ్యారు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆగ్రామ యువత, రాజాం యూత్ అసోసియేషన్, ఉత్తరాంధ్ర విద్యార్థిసేన సంయుక్తంగా రూ.50 వేల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. ఉత్తరాంధ్ర విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి, మజ్జి అప్పారావు, సుబుద్ధి శ్రీరామ్, సన్యాసినాయుడు, కంఠంరెడ్డి సూర్యనారాయణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


పిల్లలకు గిఫ్ట్‌లు, స్వీట్లు అందజేస్తున్న క్రీస్తు విశ్వాసకులు

బొండపల్లి: ఒంపల్లి గ్రామంలోని అనాధాశ్రమంలో విజయనగరం రివైవల్ టాబర్నికల్ చర్చి ఫాదర్ ఆండ్రూ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనాధ పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకు గిఫ్ట్‌లు, మిఠాయిలు పంచి పెట్టారు. భోజనాలు కూడా అందజేశారు. ఆశ్రమం నిర్వాహకులు, క్రీస్తు విశ్వాసకులు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం


జామి: పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి, అమ్మవార్లు


శృంగవరపుకోట: వేణుగోపాలస్వామి ఆలయంలో పసుపు దంచుతున్న మహిళలు

శృంగవరపుకోట: స్థానిక గాంధీ జంక్షన్‌లో ఉన్న వేణుగోపాలస్వామి ఆయంలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం తెల్లవారుజామున ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ అర్చకత్వం చేస్తున్న దేవి నేతృత్వంలో గోదాదేవికి పూజలు చేశారు. మహిళలు పాశురాలను పఠించి, అంతా కలిసి నెల గంటు పెట్టారు. ఆలయ ప్రాంగణంలో కర్రోలులో పసుపు కొమ్ములు వేసి, పసుపు దంపుడు కార్యక్రమం నిర్వహించారు. పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు. నెల రోజుల పాటూ గోదాదేవికి ప్రత్యేక పూజలు, అమ్మవారి పాశురాల పఠనం, వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

జామి: అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నగర సంకీర్తన,మేలుకొలుపులు

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోని రామాలయాల్లో నెలగంటు పెట్టి, పూజలు చేశారు. రెల్లిగౌరమ్మపేట గ్రామంలో యువత, చిన్నారులు మేలతాళాలతో నగర సంకీర్తన, మేలుకొలుపు చేశారు. భోగి పండగ వరకు మేలుకొలుపు, నగరసంకీర్తన కార్యక్రమాలు నెలరోజుల పాటు నిర్వహిస్తామని ఆ గ్రామ భజన మండలి సభ్యులు తెలిపారు.


లక్కవరపుకోట: రెల్లిగౌరమ్మపేట రామాలయంలో నెల గంటు పూజలు నిర్వహిస్తున్న పురోహితులు


లక్కవరపుకోట: ఆర్.జి.పేటలో నిర్వహించిన నగర సంకీర్తనలో పాల్గొన్న యువకులు, పిల్లలు

టీడీపీ నేతల మాయ మాటలు నమ్మొద్దు


రెల్లి గ్రామంలో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- కొత్తవలస మండలంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొత్తవలస: ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడంతో పాటు తాము అధికారంలోకి వస్తే ఏవేవో చేసేస్తామంటూ దొంగ హామీలు ఇస్తారని, వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రెల్లి గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కంటే భిన్నంగా, కనీవిని ఎరుగని రీతి లో సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోమారు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేందుకు ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని, ఆయన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.కొత్తవలస మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోనూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, స్థానిక సర్పంచ్‌లు అల్లం సత్యనారాయణ,జోడి రాములమ్మ, ఎంపీటీసీ ఉగ్గిన గురీజీ, నాయకులు మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవికుమార్, పల్లా భీష్మ, జామి సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బొత్స సందీప్ పుట్టినరోజు వేడుకలు


విజయనగరంలో సందీప్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న చీపురుపల్లి మండల నాయకులు అనంతం, శ్రీనివాసనాయుడు


గరివిడిలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, కృష్ణంనాయుడు, విశ్వేశ్వరరావు, తదితరులు

చీపురుపల్లి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తనయుడు డాక్టర్ బొత్స సందీప్ పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు మండలాల్లోనూ సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు కేక్‌లు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అలాగే నాలుగు మండలాల్లో ముఖ్య నాయకులు విజయనగరం వెళ్లి అక్కడ సందీప్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కైవల్య రథం ప్రారంభం


కైవల్య రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి వారు ఏర్పాటు చేసిన కైవల్య రథాన్ని సత్యసాయి మందిరం వద్ద ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక ఆదివారం ప్రారంభించారు. సత్యసాయి సేవా సమితి మండల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ మృతులను శ్మశానవాటికకు తరలించేందుకు గజపతినగరం మండల వాసులు ఈ కైవల్యరథాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.సునీల్ కుమార్ రథో, రాష్ట్ర గ్రామ సేవా ఇన్‌చార్జి మెట్ల సత్యన్నారాయణ, కన్వీనర్ వెంకటేష్, సభ్యులు ఆరిశెట్టి శంకరరావు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసమే ట్రస్టు నిర్వహణ


మాట్లాడుతున్న దివ్యాంగుల మహిళా సమితి జిల్లా అధ్యక్షురాలు సుజాత, వేదికపై గురుదేవ ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌కుమార్

దత్తిరాజేరు: దివ్యాంగులకు అన్ని విధాలా సహాయం చేసేందుకు, వారికి అండగా నిలిచేందుకే ట్రస్టు ఏర్పాటు చేశామని కొత్తవలస మండలం, మంగళ పాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్ అన్నారు. దత్తిరాజేరులో దివ్యాంగుల మహిళా సమితి మండల అధ్యక్షురాలు సత్యవతి ఆధ్వర్యంలో గజపతినగరం నియోజకవర్గస్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన గురుదేవ ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌కుమార్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వివిధ పరికరాలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల మహిళా సమితి జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ అవయవ లోపం ఉందని ఎవరూ దిగులు చెందాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని అన్నారు.

అమ్మకు సంక్రాంతి కానుక


తల్లుల కోసం కొనుగోలు చేసిన చీరలను చూపిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు మోహన్‌రాజు

వేపాడ: బొద్దాం ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు సంక్రాంతికి అమ్మకు కానుకగా చీరలు అందిస్తున్నారు. విద్యార్థులు ఆంగ్ల ఉపాధ్యాయుడు కర్రి మోహన్‌రాజు వద్ద డబ్బులను పొదుపు చేసుకున్నారు. ఆ డబ్బులతో విద్యార్థులు తమ తల్లులకు సంక్రాంతి పండగకు కానుకగా అందించేందుకు చీరలు కొనుగోలు చేశారు. వాటిని విద్యార్థులు తమ తల్లులకు ఆదివారం అందజేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందే దిశగా కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు మోహన్‌రాజును హెచ్‌ఎం వర్రి భాస్కరరావు, సహోపాధ్యాయులు అభినందించారు.

నకారా సేవలు చిరస్మరణీయం


చీపురుపల్లి: విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మాట్లాడుతున్న ఎస్‌టీఓ నూకరాజు


శృంగవరపుకోట: రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

చీపురుపల్లి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ సదుపాయం తీసుకువచ్చేందుకు కృషి చేసిన డి.ఎస్.నకారా సేవలు చిరస్మరణీయమని స్థానిక ఉప ఖజానాశాఖాధికారి నూకరాజు చెప్పారు. పట్టణంలోని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్ పితామహుడు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నూకరాజు మాట్లాడుతూ నకారా చేసిన కృషి వల్లే నేడు విశ్రాంత ఉద్యోగులు అంతా పింఛన్ అందుకుంటూ ప్రశాంత జీవనం గడుపుతున్నారన్నారు. ఖజానా శాఖకు సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణమే పరిష్కరిస్తామన్నారు. పలువురు విశ్రాంత ఉద్యోగుల సర్వీసు పెన్షనర్ భర్త, భార్య పుట్టిన తేదీలు పీపీఓ కాపీల్లో సక్రమంగా లేవని, వాటిని సరి చేసేందుకు పాన్‌కార్డు, ఓటరు ఐడీ పాస్‌పోర్ట్, పాఠశాల ధ్రువీకరణ వంటి పత్రాలు సమర్పిస్తే తక్షణమే మార్పు చేస్తామన్నారు. 2024 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29 వరకు విశ్రాంత ఉద్యోగులు జీవన ప్రమాణ పత్రాలు పొందుపరచాలని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.సత్యం, కార్యదర్శి అంపోలు సత్యనారాయణ, సంఘ నాయకులు ఎం.ఎస్. ఎస్. రాజు, సుబుద్ధి లక్ష్మణరావు, కెల్ల జగన్నాథరావు, ఆర్.ఉమామహేష్‌పట్నాయక్, ఆనంద్‌సాగర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో

శృంగవరపుకోట: అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని పట్టణంలోని రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆ ఫెడరేషన్ మెంబర్ ఎం.ఎస్. ఎస్. మూర్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. పెన్షనర్ల పితామహుడు డి.ఎస్.నకారా చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ విశాఖ డివిజనల్ జాయింట్ సెక్రటరీ బొడ్డేటి సూర్యనారాయణ మాట్లాడుతూ భారత సైనికాదళంలో పనిచేసి పదవీవిరమణ చేసిన డి.ఎస్.నకారా విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వాలని భారత ప్రభుత్వానికి వ్యతిరేఖంగా కేసు దాఖలు చేశారని గుర్తు చేశారు. ఈ కేసుకు సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వాలని, అది వారి హక్కు అని 1982లో సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చిందన్నారు.ఎం.రామ్మూర్తి, పి. ఈశ్వరరావు, కె.సత్యం, ముత్యాలు, ఎరుకునాయుడు సహా సుమారు 70మంది విశ్రాంత రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ నిమజ్జనోత్సవం


గౌరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో గౌరమ్మ నిమజ్జనోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నెలరోజుల క్రితం గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్టించి నిత్యపూజలు చేశారు. సర్పంచ్ కర్రి యశోద, గ్రామ పెద్దలు గళ్ల రామచంద్రుడు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనోత్సవం ప్రారంభించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ మెరపల సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు తదితరులు గౌరమ్మను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు.


పుస్తకాల వితరణ


లైబ్రేరియన్‌కు పుస్తకాలు అందజేస్తున్న స్వామినాయుడు దంపతులు

శృంగవరపుకోట: స్థానిక శాఖాగ్రంథాలయానికి పట్టణానికి చెందిన కర్టాట స్వామి నాయుడు దంపతులు రూ.12వేలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను వితరణ చేశారు. పుస్తకాలను లైబ్రేరియన్ డి.శ్రీధర్‌కు ఆదివారం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చీపురుపల్లి రూరల్(గరివిడి): ఫేకర్ సీఈఓ శర్మను సన్మానిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, గరివిడి శ్రీరాంనగర్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు


జామి : ఆత్మీయ సమ్మేళనంలో జామి హైస్కూల్ 1991 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): పూర్వ విద్యార్థులతో గరివిడిలోని శ్రీరాంనగర్ హైస్కూల్ ఆదివారం సందడిగా మారింది. ఆపాఠశాలలో 1964 నుంచి 1990 సంవత్సరాల మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. పాఠశాల చదువుల అనంతరం స్థానికంగా, వేర్వేరు ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిర పడిన వారంతా ఎన్నోఏళ్ల తర్వాత కలుసుకోవడంతో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫేకర్ సీఈఓ ఎం.ఎస్.శర్మ, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు హాజరయ్యారు. ముఖ్యఅతిథులతో పాటు కార్యక్రమ నిర్వాహకులు మజ్జి ఉమామహేశ్వరి, ఏ.వి.ఎస్.ఎం.అప్పారావు, ఎం.వెంకటేశ్వరరావు, వడ్డాది శోభ, ప్రమీల, వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, పరపతి హేమను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

జామిలో..

జామి: స్థానిక ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండల కేంద్రంలోని ఓ మామిడి తోటలో ఆదివారం నిర్వహించారు. 32 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతా పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం వనభోజనాలు చేశారు.

పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న ఏపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీశ్రీనివాస్

గజపతినగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్ సూచించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా సమ్మేళనం సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రభుత్వ, పార్టీ పదవుల్లో బీజేపీ సముచిత స్థానం కల్పిస్తోందని చెప్పారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచించారు.ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసనాయుడు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దంతినాడ అప్పలాచారి, జిల్లా ఇన్‌చార్జి పి.వెంకటరావు,జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు, సీనియర్ నాయకుడు, సంకల్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యగారి కామేష్, బీజేపీ నాయకురాలు ప్రగడ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.